క్లుప్తంగా

అయ్యప్ప స్వాములకు ప్రసాద వితరణ


ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించిన దాతలు

కొయ్యలగూడెం: అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న స్వాములకు ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం పేర్కొన్నారు. స్థానిక ఆరంజ్ ల్యాబ్ అధినేత దూలం రత్నాజీ, స్రవంతి దంపతుల ఆర్థిక సాయంతో విభిన్న హారతుల పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదం కదంబ ప్రసాదాన్ని చిన్నారులు అభిరామ్, అఖిలకుమారిలతో కలిసి భక్తులకు వడ్డించారు. 41 రోజులు మధ్యాహ్నం దాతల విరాళంతో సుమారు 400 మంది భక్తులకు (భిక్ష) అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు.

వసతులపై అధికార యంత్రాంగం ఆరా


ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పోలవరం రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వసతులపై అధికార యంత్రాంగం ఆరా తీస్తోంది. పోలవరం మండలంలోని కుంకాల, చేగొండిపల్లి గ్రామాల్లోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పరిస్థితులను ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు పరిశీలించారు. వసతిగృహంలో విద్యార్థులకు ఎవరికైనా జ్వరాలు ఉన్నాయా మరి ఏ ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయా అని వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని భోజనశాల, మరుగుదొడ్లు, మంచినీటి వసతి, పారిశుధ్యం పరిస్థితులను పరిశీలించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఉప విద్యాశాఖాధికారి సుధాకర్

చింతలపూడి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని నూజివీడు ఉప విద్యాశాఖాధికారి పీఎస్ సుధాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను సుధాకర్ గురువారం ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్.కిరణ్ కుమార్ వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడ ప్రావీణ్యం సంపాదించాలన్నారు. 9, 10 తేదీలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ పిట్టా వేణు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు


జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎల్ఎస్‌డీజీ థీమ్ శిక్షణ తరగతులు ముగిశాయి. ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో 2025–26 గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జీలుగుమిల్లి, ద్వారకాతిరుమల మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథానికి పల్లకీ ఉత్సవం

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం, యర్రంపల్లి గ్రామాల్లో గురువారం మాండనికోపనిషత్ గ్రంథానికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా సాధకులు వివేకానంద గురూజీ సనాతన సంప్రదాయాన్ని మాండనికోపనిషత్ గ్రంథం గొప్పతనాన్ని గ్రామాల్లో ప్రచారం చేశారు. చిలుకూరి శ్యామల ఆధ్వర్యంలో ప్రచారం చేస్తూ పల్లకీలో ఊరేగించి పట్టాభిషేకం చేశారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

చింతలపూడి: ఏపీ అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకాన్ని వినియోగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎ.రాంబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ 30.06.2025కు ముందు ప్లాట్లు కొని ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రచార ఆర్భాటంతోనే సరి

- రోడ్డు మార్జిన్లే డంపింగ్ యార్డులు
- డ్రైయినేజీల్లో పేరుకుపోతున్న చెత్త
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి తూట్లు


చింతలపూడి: డంపింగ్ యార్డు లేక రోడ్డు పక్కన పోసి తగలబెడుతున్న చెత్త


చింతలపూడి: డ్రైయినేజీలో పేరుకుపోయిన మురుగు


చింతలపూడి: బైపాస్ రోడ్డులో చెత్తలో చేరిన పందులు


పోలవరంలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

చింతలపూడి: ఓ పక్క ప్రభుత్వం రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అంటూ ప్రచార ఆర్భాటాలు చేస్తుంటే స్థానిక నగర పంచాయతీలో మాత్రం ఎక్కడి సమస్యలు అక్కడ దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా డ్రైయినేజీల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధాలు వెదజల్లుతున్నాయి. ప్రధానంగా చింతలపూడి నగర పంచాయతీ నుంచి కొన్ని ప్రధాన రహదారులపై ప్రయాణించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. దీంతో దోమలు పెరిగిపోయి జ్వరాలతో పట్టణాలు, గ్రామాలు అల్లాడుతున్నాయి. ముఖ్యంగా టి.నరసాపురం వెళ్లే రహదారిపై టన్నులకొద్దీ చెత్త పోస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక వారానికోసారి ఈ చెత్తను తగలబెడుతుండటంతో ఆసమయంలో వచ్చే పొగ, వేడి గాలులకు ప్రజలు నరకం చూస్తున్నారు. నగర పంచాయతీకి సరైన డంపింగ్ యార్డు లేదు. దీంతో ప్రతి రోజు వచ్చే టన్నుల కొద్దీ చెత్తను ఎక్కడ పోయాలో నగర పంచాయతీ అధికారులకు అర్థం కావడం లేదు. వీటిల్లో పందులు చేరి అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి.

లోపించిన పారిశుధ్యం

కనీసం బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయడంపై అధికారులు శ్రద్ధ వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు బయటికి పోయే దారిలేక గ్రామాల్లో అపారిశుధ్యం గోచరిస్తుంది. పలు రహదారుల్లో రోడ్డు పక్కన పిచ్చి చెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోయి రోడ్లను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం రోడ్డు పక్కన ఉన్న పిచ్చి చెట్లు నిర్మూలించడానికి కలుపు మందు కొట్టాలని కోరుతున్నారు. చింతలపూడి నగర పంచాయతీలో జనాభా నలభై వేలకు చేరుకుంటుంది. మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు సంవత్సర ఆదాయం రూ.42 లక్షలు ఉండేది. నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేశాక రూ.1.63 లక్షలకు ఆదాయం పెరిగింది. కార్యాలయంలో సిబ్బంది ఎక్కువగా డిప్యుటేషన్ పైనే పని చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు 80 మందికి పైగా పని చేస్తున్నారు. వారికి జీతాలకే రూ.12 లక్షలకు పైగా ఖర్చు పెడుతున్నారు. దీంతో పారిశుధ్య పనులు చేపట్టడానికి నిధులు ఉండటం లేదని అధికారులు వాపోతున్నారు.

అధ్వాన్నంగా పారిశుధ్యం

పోలవరం రూరల్: పోలవరం గ్రామ పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ప్రధాన రోడ్డు మార్గంలో తప్ప వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. పారిశుధ్య పనులపై పంచాయతీ అజమాయిషీ కొరవడింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం రోడ్లపై చెత్తను తొలగించిన సంఘటనలు కొరవడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీధులు, డ్రెయిన్లపై ఎక్కడా బ్లీచింగ్ చల్లిన సంఘటనలు కానరావడం లేదని చెబుతున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, పందులు ఆ ప్రాంతంలో తిరగడంతో అపరిశుభ్రంగా తయారవుతున్నాయని ఆరోపిస్తున్నారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించిన సంఘటన కానరావడం లేదన్నారు. స్వచ్ఛాంధ్ర పేరుతో ఎక్కడా చెత్తాచెదారం కనిపంచకూడదని ఓ పక్క హడావిడి చేస్తున్నప్పటికీ మరో వైపు క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కానరావడం లేదు.

పారిశుధ్యం పై దృష్టి సారించాలి



అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించి ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పట్టణంలో దోమలు పెరిగి ప్రజలు వ్యాధల బారిన పడుతున్నారు. ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర అంటూ సంబరాలు చేసుకోవడం కాదు. నిధులు కేటాయించి ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పక్కా డ్రెయిన్లు నిర్మించాలి.

–కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు

రోడ్డును నిర్మించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం రోడ్ సీపీఐఎంఎల్ ఆఫీసు నుంచి నాగదేవత గుడి వరకు రోడ్డు వేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఈ రోడ్డు వేయాలని ప్రజా ప్రతినిధులకు మున్సిపల్ కమిషనర్లకు చైర్ పర్సన్లకు అనేక విజ్ఞప్తులు చేశామన్నారు. ఇది మినీ బైపాస్ రోడ్డుగా ఉంటుంది అటు బుట్టాయగూడెం నుంచి వచ్చే వారికి సుబ్బంపేట వెళ్లాలన్నా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నా ఈ రోడ్డు కీలకమన్నారు. అటువంటి రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మంచిలి రాజు, మల్లేటి శ్రీనివాస్, షేక్ బాజీ, మరపట్ల బాబురావు, పీవోడబ్ల్యూ నాయకులు కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం


అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పాఠ్య ప్రణాళికలో భాగంగా రోజూ జరిగే ఉపన్యాసాలతో పాటుగా అప్పుడప్పుడు ఇలాంటి అతిథి ఉపన్యాసాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు ఆర్.విజయదీపిక మాట్లాడుతూ జంతు శాస్త్రంలో పిండోత్పత్తి శాస్త్రంలో ఫలదీకరణ గురించి వివరించారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ అటానమస్ కళాశాల అధ్యాపకులు కె.సుధాకర్ అతిథి ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ ఎం.మధు, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు టీవీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుంజా శ్రీను

వేలేరుపాడు: ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలని, అలా చేయని అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వేలేరుపాడులో సమావేశం నిర్వహించారు. ఈ ఈ సమావేశానికి హాజరైన ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ వేలేరుపాడు, ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దీని వలన ఏజెన్సీ ప్రాంత హక్కులు ఆదివాసీలకు అందని ద్రాక్ష గానే మిగులుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఉయిక ముత్యాలరావు, ఏవీఎస్పీ మండల అధ్యక్షులుపొట్ల మోహన్ దొర, శ్రీకాంత్, గణేష్, బ్రహ్మయ్య, పుల్లారావు, వెంకటేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతోనే ఉన్నత విద్య


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సుధీర్‌కుమార్

ద్వారకాతిరుమల: విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా మానసిక కౌన్సెలర్ ఎమ్.సుధీర్ కుమార్ అన్నారు. మండలంలోని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వరల్డ్ మెంటల్ హెల్త్ వీక్‌లో భాగంగా ఏపీసీ పంకజ్ కుమార్, జీసీడీఓ బి.నవీన ఆదేశాల మేరకు, పాఠశాల సహ ప్రధానోపాధ్యాయులు యు.ఫణికుమార్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. సుధీర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా ఆలోచిస్తూ, ఉపాధ్యాయుల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ సత్ప్రవర్తన అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోగ్రేడ్ పొగాకుకు కనీస ధర కల్పించాలి



సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

బుట్టాయగూడెం: లోగ్రేడ్ వర్జీనియా పొగాకుకు కిలో రూ.300 ధర కల్పించాలని, ప్రత్తి, మొక్కజొన్న, వరి, బొబ్బర, జీడిమామిడి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఆ సంఘ మండల మహాసభ వెట్టి వీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ లోగ్రేడ్ పొగాకుకు కిలో రూ.100 లోపు ధర ఇవ్వడం వలన పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులుగా వెట్టి వీరయ్య, కార్యదర్శిగా కోర్సా జలపాలుతో పాటు మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోర్సా జలపాలు, బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ


జంగారెడ్డిగూడెం: మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 10 నుంచి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలను బహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో), ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో బోధనేతర పనులను అక్టోబర్ 10 నుంచి బహిష్కరించాలని నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి, కె.నరహరి, బి.మనోజ్‌కుమార్, సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.ప్రకాష్‌రావు, ఎన్.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ ఐవీరత్నం, టి.రామకృష్ణ, కె.శ్రీను, జీఎస్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులంతా బహిష్కరిస్తున్నాం


కామవరపుకోట: మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

కామవరపుకోట: ఈ నెల 10 వ తేదీ నుంచి అన్ని బోధనేతర పనులు బహిష్కరణ చేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి చిన్నం ప్రశాంత్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులైన రాజకీయ పనులు చెప్పకూడదని దీని వలన విద్యార్థులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ప్రభుత్వం దీనిపై మరో సారి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ వివిధ సంఘల నాయకులు కస్సే శ్రీనివాస్, మళ్ళ నాగేశ్వరరావు, టోకూరి బలరామ్, జి.ఆర్ శర్మ, రవిశోభన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన దోషులను శిక్షించాలి


ఆందోళన చేస్తున్న రేచర్ల గ్రామస్తులు

చింతలపూడి: మండలంలోని రేచర్ల రెండో మైలు రాయి వద్ద రామాలయంలోని విగ్రహాలను తొలగించి గర్భాలయాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గురువారం గ్రామస్తులు ఆందోళన దిగారు. గ్రామస్తులు దారావతు శంకర్, మూడు సావేరియలు తెలిపిన కథనం మేరకు గతంలో 40 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన ఒక దాత రామాలయం నిర్మాణానికి స్థలాన్ని దానంగా ఇచ్చారని తెలిపారు. దాత చనిపోవడంతో అతడి కుటుంబ సభ్యులు ఆలయం వద్దకు ఎవరినీ అనుమతించడం లేదని తెలిపారు. రామాలయాన్ని పునరుద్ధరించడంతో పాటు దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. గ్రామస్తులు చింతలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కె.సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

టి.నరసాపురం: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా 32వ మహాసభలు ఈ నెల 27, 28, 29 తేదీల్లో టి.నరసాపురంలో నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి బొడ్డపాటి రాజు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు గూడెల్లి వెంకట్రావు విలేకరులతో మాట్లాడుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు టి.నరసాపురంలో మొదటిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. మహాసభలను జయప్రదం కోరుతూ గ్రామాల్లో కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బుద్దులు గంగాభవాని, బుద్దుల దుర్గమ్మ, ఇందిరా పార్వతి, కుందా చెల్లమ్మ, షైదా రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మహాసభలు జయప్రతం చేయాలని జంగారెడ్డిగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం ఓ ప్రకటన విడుదల చేశారు.

యువతకు స్ఫూర్తిదాయకుడు చేగువేరా



చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కుక్కునూరు: యువతకు చేగువేరా స్ఫూర్తిదాయకమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి అన్నారు. గురువారం చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విప్లవ భావజాలానికి యువతకు చేగువేరా యూత్ ఐకాన్ అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మోడియం నాగమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్, బియ్యాన శ్రీను, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, సీఐటీయూ నాయకులు పోచారపు వెంకటేశ్వర్లు, శరత్ పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

టి.నరసాపురం: బొర్రంపాలెం గ్రామంలో స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం నిర్వహించింది. అధినేత పెండ్యాల అభిషేక్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలో రెండు రోజుల పాటు మలాథీయన్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక్ బాబు మాట్లాడుతూ గ్రామంలో దోమల వ్యాప్తితో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వాటిని అరికట్టే క్రమంలో సేవా సంస్థ ద్వారా మలాథీయన్ చేయించినట్లు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ రచ్చబండ

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ రచ్చబండ కార్యక్రమం శుక్రవారం బయ్యన్నగూడెం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరవుతారని పార్టీ శ్రేణులు హాజరు కావలసిందిగా సూచించారు.

అంగన్‌వాడీ స్కూల్‌కు సహాయం

జంగారెడ్డిగూడెం: మండలంలోని పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు గ్యాస్ స్టౌ, స్కూల్ టేబుల్ సమకూర్చారు. దాతలు ముల్లపూడి శ్రీను, పంపన శ్రీను వీటిని అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పిల్లల చదువుకు, అంగన్‌వాడీ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు మెరుగుపడేలా ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కాటా ఏర్పాటు


నూతన కాటాను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

టి.నరసాపురం: ఆయిల్‌పామ్ రైతుల సౌకర్యార్థం నూతన కాటా ఏర్పాటు చేసినట్లు నవ భారత్ కంపెనీ డీజీఎం రాజగోపాల్ తెలిపారు. మర్రిగూడెం గ్రామంలో నవ భారత్ కంపెనీ ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ కాటాను నవ భారత్ ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మక్కినవారిగూడెం సొసైటీ చైర్మన్ ఆచంట సూర్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ మర్రిగూడెం, మక్కినవారిగూడెం, బండివారిగూడెం పంచాయతీల్లోని రైతులకు మేలు కలుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గెడా శ్రీధర్, ఆలపాటి పాపారావు, పిన్నమనేని రాము, పొట్లా రామారావు, పూనెం ఆదిత్య, బలుసు వేణు, కాకర్ల మోహన్, కొయ్యమూడి పార్థు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ మంత్రి వనిత పరామర్శ


సూరయ్యను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

ద్వారకాతిరుమల: స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు ములకాల పెద్ద పానకాలు తండ్రి సూరయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. గుండె సంబంధిత చికిత్స చేయించుకున్న పార్టీ నాయకుడు కాలింగి వీరాస్వామి ఇంటికి వెళ్లి, ఆయనను పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పోల్కంపల్లి అనీల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, పానమాల ఉమామహేశ్వరరావు, చిలుకూరి చంద్రం, చెలికాని బుల్లియ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.